గ్రామాల్లో దోమల బెడద

● పేరుకుపోయిన చెత్తాచెదారం
● ఫాగింగ్ మరిచిన అధికారులు

మంగపేట : మండలంలో దోమల బెడద రోజురోజుకు తీవ్రమవుతోంది. ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా పోతుంది. చిన్నపిల్లలు దోమకాటు దురదతో నిద్రపోకుండా గుక్కపట్టి ఏడుస్తున్నారని తల్లిదండ్రులు వాపోతున్నారు. దోమల వలన గ్రామాల్లో జ్వరాలు సైతం విజృంభిస్తున్నాయి. వర్షాకాలం సమీపించి మూడు రెండు పూర్తి కావస్తున్నా గ్రామాల్లో దోమల నివారణకు ఒక్కసారి కూడా ఫాగింగ్ చేయలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం పనులు, చెత్త సేకరణ జరుగకపోవడంతో చెత్తాచెదారం పేరుకుపోయి దోమలకు ఆవాసాలుగా మారాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. గ్రామ పంచాయతీల కార్యదర్శులు వారి హాజరుకే పరిమితం అవుతున్నారని, ప్రత్యేకాధికారులు కనీసం కన్నెత్తి చూడటం లేదన్నారు. మండలస్థాయి అధికారులు సైతం ప్రజల సమస్యలను పట్టించుకోక పోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై జిల్లా ఉన్నతాధికారులు స్పందించి గ్రామాల్లో దోమల బెడద నివారించేందుకు గ్రామాల్లో పారిశుద్ధ్యం తొలగింపు, దోమల నివారణకు చర్యలు చేపట్టే విధంగా చొరవ చూపాలని ప్రజలు కోరుతున్నారు.

నిధులు లేకనా నిర్లక్ష్యమా

దోమల నివారణ కోసం ఒక్కో ఫాగింగ్ మిషన్‌కు రూ. 49 వేలకు పైగా ఖర్చుచేసి మండలంలోని 25 గ్రామ పంచాయతీలకు గ్రామానికి ఒకటి చొప్పున కొనుగోలు చేశారు. వాటిని వినియోగించకుండా పెట్రోలు, (మలాథియాన్)దోమల మందు కొనుగోలు చేసేందుకు డబ్బులు లేవని కార్యదర్శులు చెపుతున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. రోజువారీగా పారిశుద్ధ్యం పనులు, తడిపొడి చెత్త సేకరణ పనులకు వినియోగించేందుకు ట్రాక్టర్‌కు ర. 6.50 లక్షలతో ప్రతీ గ్రామానికి ఒకటి, కమలాపురం గ్రామానికి 02 చొప్పున 26 ట్రాక్టర్లను సుమారు రూ.1.56 కోట్లకు పైగా ఖర్చు చేసిన కొనుగోలు చేసిన ట్రాక్టర్లను సైతం డీజిల్‌కు డబ్బులు లేవనే సాకుతో వినియోగించడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. వర్షాకాలంలో ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా పరిసరాల పరిశుభ్రత, క్లోరినేషన్ పనులను చేపట్టేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. జిల్లా ఉన్నతాధికారులు ఆదేశించినా మండలంలో అమలు కాకపోవడం గమనార్హం.



కమలాపురంలో గ్రామపంచాయతీ కార్యాలయం పక్కన పేరుకుపోయిన చెత్త



ఎంపీడీఓ కార్యాలయంలో మూలన పడేసి ఉన్న ఫాగింగ్ మిషన్లు

ప్రజల ఆరోగ్యాలపై పట్టింపు లేదు



ప్రజల ఆరోగ్యాలంటే పంచాయతీ, మండల అధికారులకు పట్టింపులేకుండా పోయింది. వర్షాకాలం ప్రారంభం నుంచి ఇప్పటి వరకు గ్రామాల్లో ఫాగింగ్ చేయక పోవడంతో దోమల బెడద తీవ్రంగా ఉంది. దోమల వలన ప్రజలు మలేరియా డెంగీ జ్వరాల బారిన పడుతున్నా రు. అయినప్పటికి గ్రామాల్లో ఫాగింగ్, దో మ ల మందు పిచికారి చేయకపోవడంతో ప్ర జలు జ్వరాల బారిన పడుతున్నారు. ఈ విషయంపై జిల్లా అధికారులు తక్షణమే స్పందించాలి.
– కబ్బాక శ్రావణ్‌కుమార్, తుడుందెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షుడు

ఇసుక లారీలతోనే కూలిన బ్రిడ్జి

ములుగు రూరల్ : ఇసుక లారీలను నియంత్రణ చేయక పోవటం వల్లనే మల్లంపల్లి గ్రామ సమీపంలోని బ్రిడ్జి కూలిపోయిందని బీఆర్ఎస్ ములుగు నియోజకవర్గ ఇన్‌చార్జ్ బడే నాగజ్యోతి అన్నారు. గురువారం పార్టీ శ్రేణులతో కలిసి మల్లంపల్లి వద్ద కూలిన బ్రిడ్జిని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా నాగజ్యోతి మాట్లాడుతూ జిల్లాలో రోజురోజుకు వేలకొద్దీ లారీలు ఇసుకను తరలిస్తుండటంతో మంగపేట నుంచి మల్లంపల్లి వరకు రోడ్డు గుంతలమయంగా మారింది. ప్రమాదాలు జరుగుతున్న అధికారులు స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. బ్రిడ్జి కూలడం వల్ల రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారని, కిలోమీటర్ల దూరం అదనంగా ప్రయాణించాల్సి వస్తుందని అన్నారు. కార్యక్రమంలో నాయకులు భిక్షపతి, చంద్రమౌళి, విజయరామ్ నాయక్, రామ్మూర్తి, రామసహాయం, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కూలిన బ్రిడ్జిని పరిశీలిస్తున్న నాగజ్యోతి

బాధిత కుటుంబాలకు చేయూత



ఎస్ఎస్‌తాడ్వాయి: జర్నలిస్టు కుటుంబానికి ఆర్థికసాయం అందజేస్తున్న జిల్లా జర్నలిస్టులు

ఎస్ఎస్‌తాడ్వాయి : మండలంలోని కాటాపూర్‌లో ఇటీవలన మృతి చెందిన ఓ దినపత్రిక విలేకరి తమ్మల సమ్మయ్య కుటుంబానికి జిల్లా జర్నలిస్టులు చేయుతనిచ్చారు. గురువారం కాటాపూర్‌లో జరిగిన మృతుడి పెద్దకర్మకు జిల్లా జర్నలిస్టులు హాజరై కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మృతుడి కుటుంబానికి జిల్లా జర్నలిస్టుల ఆధ్వర్యంలో రూ. 70 వేల ఆర్థికసాయం అందజేశారు. జర్నలిస్టుల నాయకులు మాట్లాడుతూ జర్నలిస్టుల మృతుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉండాలన్నారు. పరామర్శించిన వారిలో ఐజేయూ జిల్లా అధ్యక్షుడు ఎండీ షఫీ, జిల్లా ఉపాధ్యక్షుడు బేతి సతీష్, నాయకులు చిదురాల వాసు, వినయ్‌కుమార్, శివకుమార్, బట్టు గోపి, తాడ్వాయి ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు చల్లగొండ శ్రీకాంత్‌రెడ్డి, జర్నలిస్టులు ఉన్నారు. కాగా బాధిత కుటుంబాన్ని బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి, మాజీ జెడ్పీటీసీ రామసహాయం శ్రీనివాస్‌రెడ్డి, పార్టీ నేతలతో కలిసి పరామర్శించారు.

వాజేడు : మండలంలోని ఏడ్జెర్లపల్లి గ్రామంలో గురువారం బాధిత కుటుంబాలను స్థానిక కాంగ్రెస్ నాయకులు ఆర్థికసాయం అందించారు. గ్రామానికి చెందిన కొండగొర్ల నర్సింహారావు, ఉప్పల సమ్మయ్య ఇటీవల మృతి చెందారు. వారి దశదినకర్మలకు స్థానిక కాంగ్రెస్ నాయకులు పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. పరామర్శించిన వారిలో బట్ట దామోదర్, అంకెనబోయిన నర్సింహారావు, గార వెంకట నర్సయ్య, సంద్రు గొంద లింగయ్య, తదితరులు ఉన్నారు.

బస్సు కింద పడి వృద్ధుడికి తీవ్ర గాయాలు

ములుగు రూరల్ : బస్సులో ప్రయాణిస్తున్న వృద్ధుడు బస్సు దిగుతున్న క్రమంలో ప్రమాదవశాత్తు కిందపడి తీవ్ర గాయాలైన సంఘటన స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద గురువారం చోటు చేసుకుంది. మండలంలోని జాకారం గ్రామానికి చెందిన ఆరెందుల రాజయ్య నెల రోజుల నుంచి ములుగులో అద్దె ఇంట్లో నివాసముంటున్నాడు. పని నిమిత్తం గురువారం జాకారం వెళ్లి తిరిగి వస్తుండగా హనుమకొండ నుంచి ములుగు వస్తున్న ఆర్టీసీ టీఎస్ 03యుసి 6888 నంబర్‌గల బస్సులో ములుగుకు చేరుకున్నాడు. జూనియర్ కళాశాల వద్దకు చేరుకోగానే బస్సు ఆపుతున్న క్రమంలో రాజయ్య కదులుతున్న బస్సు నుంచి దిగాడు. ఈ క్రమంలో రాజయ్య ప్రమాదవశాత్తు బస్సు కింద పడడంతో తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా ప్రథమ చికిత్స అందించి వరంగల్ ఎంజీఎంకు 108 సహాయంతో తరలించారు. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి బస్సును పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

విద్యార్థులకు క్రీడాదుస్తుల అందజేత



వెంకటాపురం(ఎం): క్రీడాదుస్తులు అందుకున్న విద్యార్థులతో హెచ్ఎం చంద్రశేఖర్



వాజేడు : టై, బెల్టు, బ్యాడ్జీలు అందుకున్న విద్యార్థులతో ఎంఈఓ, ఉపాధ్యాయులు

వెంకటాపురం(ఎం): మండలంలోని లక్ష్మీదేవిపేట జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఇనిగాల చంద్రశేఖర్ రూ.30 వేల విలువ చేసే క్రీడాదుస్తులను అందించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ విద్యార్థుల్లో క్రీడాస్ఫూర్తిని పెంపొందించేందుకు సొంతంగా రూ.30 వేలు ఖర్చు చేసి 65 మంది విద్యార్థులకు క్రీడాదుస్తులు అందించినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బండి సురేష్, పద్మ, శ్రీనివాస్, సుధాకర్, రామకృష్ణ, కృష్ణమూర్తి, పీఈటీ దీప్తి, తదితరులు పాల్గొన్నారు.

టై, బెల్టుల పంపిణీ

వాజేడు : మండలంలోని గుమ్మడిదొడ్డి గ్రామానికి చెందిన అన్నదమ్ములు కారం ఆనంద్, కారం అరుణ్ (కేఎస్ఆర్ సన్స్) విద్యార్థులకు టై, బెల్టు, బ్యాడ్జీలు అందించారు. స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా గుమ్మడిదొడ్డి ప్రభుత్వ పాఠశాలకు చెందిన 50 మంది విద్యార్థులకు గురువారం ఎంఈఓ వెంకటేశ్వర్లు చేతుల మీదుగా వీటిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ విద్యార్థులకు చేయూత కల్పించడం వారి గొప్ప మనసుకు నిదర్శనమన్నారు. విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవడంలో స్థానికులు సందర్భానుసారం చేయూతను ఇస్తే బాగుంటుందని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం గిరిప్రసాద్, ఉపాధ్యాయుడు నాగరాజు, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్‌పర్సన్ ఇర్ప రాజ్యలక్ష్మి, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

పీఎంశ్రీ విద్యాబోధన అంగన్‌వాడీల్లో నిర్వహించాలి



వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

ములుగు రూర్ : ప్రీ ప్రైమరీ, పీఎం శ్రీ విద్యాబోధన అంగన్‌వాడీ సెంటర్లలో నిర్వహించాలని కోరుతూ గురువారం సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టర్ దివాకరకు, డీడబ్ల్యూఓ తుల రవికి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి రత్నం రాజేందర్ మాట్లాడుతూ పీఎంశ్రీ విద్యాబోధన అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహించి ఆ బాధ్యతలను అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్స్‌కు ఇవ్వాలని అన్నారు. పీఎం శ్రీ పథకంలో ఇన్‌స్ట్రక్టర్లకు, హెల్పర్స్‌కు ఇచ్చే వేతనం అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఐసీడీఎస్ నిబంధనల ప్రకారం ఆరేళ్ల లోపు పిల్లలను ప్రైవేట్ స్కూల్స్‌కు పంపకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దావూద్, లక్ష్మినర్సమ్మ, జ్యోతి, అరుణ తదితరులు ఉన్నారు.

గిరిజన గురుకులంలో స్పాట్ కౌన్సిలింగ్

ములుగు రూరల్ : ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని గిరిజన గురుకుల పాఠశాలల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి స్పాట్ కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నట్లు రీజినల్ కోఆర్డినేటర్ హరిసింగ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. టీజీ టీడబ్ల్యూయూఆర్‌జేసీ బాలుర, బాలికల గురుకుల పాఠశాల కాటారం, ఇంచర్ల బాలుర పాఠశాల, వాజేడు బాలికల గురుకుల పాఠశాలల్లో 5 నుంచి 9వ తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేస్తామని అన్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు ఈ నెల 18న ఇంచర్ల ఎర్రిగట్టమ్మ వద్ద ఉన్న గురుకుల పాఠశాలలో దరఖాస్తులు చేసుకున్న వారు, చేసుకోని వారు ఒరిజినల్ సర్టిఫికెట్లు, లేదా ఆధార్ కార్డు, స్టడి సర్టిఫికెట్, ఆదాయం సర్టిఫికెట్‌తో స్పాట్ కౌన్సిలింగ్‌కి హాజరు కావాలని సూచించారు. విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఇలా అయితే.. వెళ్లేది ఎలా



వాజేడు : రహదారికి అడ్డంగా ఇటుకలను వేయడంతో అటు వైపు వెళ్లే స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మండల కేంద్రంలోని రేషన్ షాపు, పశువైద్యశాల, హరిజన వాడ, హెల్త్ సబ్‌సెంటర్ అటు వైపే ఉన్నాయి. వారంతా ఈ సీసీ రోడ్డుపై నుంచే వెళ్లాల్సి ఉంటుంది. అయితే పశువైద్యశాల ముందు సీసీ రోడ్డుపై ఒక కాంట్రాక్టర్ ప్లయాష్ ఇటుకలను రోడ్డుకు అడ్డంగా వేశాడు.

అనుమతులు లేకుండా కలప కోత

● మిషన్‌ను స్వాధీనం చేసుకున్న అటవీశాఖ అధికారులు

కన్నాయిగూడెం: మండలంలోని బుట్టాయిగూడెంలో కొన్ని రోజుల నుంచి అనుమతులు లేకుండా కట్టెను కోస్తున్న వ్యక్తి నుంచి కట్టెకోత మిషన్‌ను అటవీ శాఖ అధికారులు పట్టుకొని ఏటూరునాగారం రేంజ్ కార్యాలయానికి ట్రాక్టర్‌లో తరలించారు. రేంజ్ అధికారి అప్సర్ నిస్సా అందించిన వివరాలిలా ఉన్నాయి. బుట్టాయిగూడెంలో కొన్ని రోజుల నుంచి మంగపేట మండలం కమలాపురం గ్రామానికి చెందిన శ్రీను ఎలాంటి అనుమతులు లేకుండా కలపను మిషన్‌తో కోసి వస్తువులను చేస్తున్నాడన్నారు. విషయం తెలుసుకున్న అటవీశాఖ సిబ్బంది గురువారం రేంజ్ అధికారి ఆధ్వర్యంలో దాడులు చేసి అతడి వద్ద ఉన్న కట్టెను కోసే మిషన్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. విచారణ చేసి సంబంధిత వ్యక్తిపై కేసు నమోదు చేయనున్నట్లు తెలిపారు. ఎవరైనా అనుమతులు లేకుండా కలపను తెచ్చి పనులు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

సమస్యలను నిర్లక్ష్యం చేస్తే అసెంబ్లీ ముట్టడిస్తాం

● కల్లుగీత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రవి గౌడ్

గోవిందరావుపేట : కల్లుగీత కార్మికుల సమస్యలను నిర్లక్ష్యం చేస్తే అసెంబ్లీ ముట్టడిస్తాం అని కల్లుగీత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గుండెబోయిన రవి గౌడ్ అన్నారు. మండలంలోని చల్వాయి నుంచి పస్రా రాంపూర్ వరకు కల్లుగీత కార్మికులు సర్దార్ సర్వాయి పాపన్న జయంతి ఉత్సవాల సందర్భంగా కల్లుగీత కార్మిక సంఘం జిల్లా కమిటీ నాయకులు బొనగాని సారయ్యగౌడ్, వత్సవాయి సారయ్య గౌడ్ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రవిగౌడ్ హాజరై మాట్లాడుతూ కల్లుగీత కార్మికులకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు తక్షణమే పరిష్కరించాలని, ఏజెన్సీలో రద్దు చేసిన గత సొసైటీలను తక్షణమే పునరుద్ధరించాలని అన్నారు. అమరవీరుల స్ఫూర్తితో కల్లుగీత కార్మికులు ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గీత కార్మికులు మల్లేష్, ఆంజనేయులు, అయిలుమల్లు, సాంబయ్య, యాకయ్య, రవి, స్వామి, కృష్ణ, సింహాచలం, రాంబాబు, భిక్షపతి పాల్గొన్నారు.



గోవిందరావుపేటలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న కల్లుగీత కార్మికులు

గ్రామాల్లో వైద్యశిబిరాలు



వెంకటాపురం(కె) : రక్తనమూనాలు సేకరిస్తున్న వైద్య సిబ్బంది



మంగపేట : రమణక్కపేటలో వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారిణి యమున

వెంకటాపురం(కె) : మండలంలోని మలాపురం, పాత్రాపురం, వెంగళరావుపేట గ్రామాల్లో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో గురువారం వైద్యశిబిరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు వైద్యపరీక్షలు చేసి మందులను అందజేశారు. అనంతరం వైద్యసిబ్బంది గ్రామంలోని ప్రతీ ఇంటికి వెళ్లి ఫీవర్ సర్వే నిర్వహించారు. గ్రామంలో నీటి తొట్లు, కూలర్లలో నిల్వ ఉన్న నీటిని తొలగించారు. గ్రామంలో జ్వరంతో బాధపడుతున్న వారి నుంచి రక్త నమూనాలను సేకరించారు. కార్యక్రమంలో హెచ్ఈఓ కోటిరెడ్డి, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

మంగపేట : మండలంలోని రమణక్కపేటలో చుంచుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారిణి యమున ఆధ్వర్యంలో గురువారం వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 47 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి జ్వరంతో బాధపడుతున్న ఇద్దరిని గుర్తించి వారికి రక్తపరీక్షలు చేసి మందులను పంపిణీ చేశారు. సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ఆరోగ్య జాగ్రతలు తప్పక పాటించాలని సూచించారు. ఏఎన్ఎం భాగ్యలక్ష్మి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పాఠశాలకు దాతల సాయంతో ఇంటర్‌నెట్

కన్నాయిగూడెం: మండలంలోని బుట్టాయిగూడెంలోని ప్రాథమిక పాఠశాలలో దాతలు ఇంటర్‌నెట్ కనెక్షన్ ఏర్పాటు చేశారు. బుట్టాయిగూడెంలోని పాఠశాలలో సుమారు 150 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. విద్యార్థుల కోసం ప్రభుత్వం డిజిటల్ క్లాస్‌లకు సంబంధిత సామగ్రిని ప్రొజెక్టర్, మానిటర్ తదితర సామాగ్రిని గతంలోనే అందించారు. పాఠశాలకు ఇంటర్ నెట్ సౌకర్యం లేకపోవడంతో విద్యార్థులకు అందాల్సిన డిజిటల్ క్లాస్‌లు నిర్వహించడం లేదు. ఈ విషయం పాఠశాల సిబ్బంది విషయాన్ని పేరెంట్స్‌కు తెలుపగా దాతలు ముందుకొచ్చి సాయం చేయాలని కోరగా గ్రామానికి చెందిన కాంగ్రెస్ మండల ఇన్‌చార్జ్ జాడి రాంబాబు స్పందించి ఇంటర్‌నెట్ వైఫై ఏర్పాటు చేశారు. వారికి పేరెంట్స్, ఉపాధ్యాయులు, విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ యువకులు నర్సింహారావు, భిక్షపతి, సురేందర్, వెంకట్, అనిల్, కోటేష్, తదితరులు పాల్గొన్నారు.



ఇంటర్‌నెట్ సామగ్రిని హెచ్ఎం ప్రజ్ఞకు అందజేస్తున్న కాంగ్రెస్ నేత రాంబాబు

జాతీయజెండా ఎగురవేద్దాం ఇలా..

వెంకటాపురం(ఎం): బ్రిటీష్ పాలకులు 1947 ఆగస్టు 14 అర్ధరాత్రి దాటిన తర్వాత మన దేశానికి స్వాతంత్ర్యాన్ని ప్రకటించారు. 15న ఉదయం గవర్నర్ భవనంపై, 16వ తేదీ ఉదయం ఎర్రకోటపై మువ్వన్నెల జెండా రెపరెపలాడింది. 79వ స్వాతంత్ర్య ఉత్సవాల్లో భాగంగా హర్ ఘర్ తిరంగా పేరిట ప్రతి ఇంటా మువ్వన్నెల జెండాను ఎగరవేయాలని ప్రధాని మోదీ పిలుపునిచ్చారు. స్వాతంత్ర్య దినో త్సవ వేడుకలను శుక్రవారం నిర్వహించేందుకు దేశవ్యాప్తంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. జాతీయ జెండాను ఎగురవేసేందుకు కొన్ని నియమ నిబంధనలను పొందుపర్చారు. ఆ నిబంధనలను గణతంత్ర్య దినోత్సవం, స్వాతంత్ర్య దినోత్సవం రోజున జెండా ఎగురవేసే ప్రతిఒక్కరూ పాటిస్తారు. ఆ నిబంధనలు ఏంటి.. జెండా ఎలా ఎగురవేయాలని తెలుసుకుదాం..



నిబంధనలు ఇలా..

- 2002లో మార్పు చేసిన నియమావళిని అనుసరించి జాతీయ పతాకం విషయంలో కొన్ని నిబంధనలు తప్పనిసరి చేశారు.
- సాధారణంగా జెండా రూపకల్పన దీర్ఘచతురస్ర ఆకారంలో ఉంటుంది.
- జాతీయ జెండాలోని మూడు రంగులు సమాన వెడల్పు ఉండాలి. పైన కాషాయ వర్ణం, మధ్యలో తెలుపు, కింద ముదురు ఆకుపచ్చ రంగులు ఉండాలి.
- జెండా పొడవు, వెడల్పుల నిష్పత్తి 2:3గా ఉండాలి.
- మధ్య గల తెలుపువర్ణంలో 24 ఆకులు గల నావికా నీలం రంగు గల అశోకచక్రం ఉండాలి.
- భారత జాతీయ పతాకాన్ని పాలిస్టర్, కాటన్, ఉన్ని, సిల్క్, ఖాదీతో తయారు చేసిన వస్త్రాన్ని మాత్రమే వాడాలి.
- జెండా ఎగురవేసినప్పుడు కాషాయ వర్ణం పైకి వచ్చేలా జాగ్రత్తలు తీసుకోవాలి.
- ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలతో పాటు అన్ని విద్యాసంస్థలు అన్ని రోజుల్లో జాతీయ జెండాను ఎగురవేయవచ్చు.
- ఏదైనా సమావేశ స్థానంలో జెండా ప్రదర్శించాలనుకుంటే ప్రసంగకర్తకు కుడివైపు జెండా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి.
- జాతీయ జెండాకు సమానంగా గానీ, ఇంకా ఎత్తులో గానీ ఇతర ఏ జెండా ఎగురకూడదు.
- జాతీయ జెండా ఊరేగింపులో గానీ, కవాతులో గానీ ఇతర జెండాలతో కలిసి తీసుకువెళ్లేటప్పుడు వాటికి ముందు మధ్యలో గానీ, కుడి వైపునకు గాని ఉండేలా చూసుకోవాలి.
- జెండాను ఎగురవేసేటప్పుడు, దించే సమయంలో వ్యక్తులంతా జెండాకు అభిముఖంగా నిలబడాలి.
- జెండాను ఎగురవేసేటప్పుడు ఎట్టి పరిస్థితుల్లోనూ నేలను తాకకూడదు. ఎగురవేసేటప్పుడు వేగంగాను, అవనతం చేసేటప్పుడు మెల్లగా దించాలి.
- ఉద్దేశ్యపూర్వకంగా జెండాను తలకిందులు చేయడం, నీరు తదితర ద్రవాల్లో ముంచటం వంటివి చేయడం నేరం.
- ఎగురవేయటానికి ముందు జెండాలో పువ్వులు తప్ప ఇతర వస్తువులను ఉంచడం, జెండా మీద రాయడం నిషిద్ధం.

క్లుప్తంగా

మాజీ మంత్రిని కలిసిన బీఆర్ఎస్ నేతలు



ములుగు రూరల్ : నర్సంపేటలో ఓ ప్రైవేట్ కార్యక్రమానికి వచ్చిన మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావును స్థానిక బీఆర్ఎస్ నాయకులు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ములుగు నియోజకవర్గ ఇన్‌చార్జ్ బడే నాగజ్యోతి ఆధ్వర్యంలో నాయకులు హరీశ్‌రావును కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం ములుగులో నెలకొని ఉన్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. హరీశ్‌రావును కలిసిన వారిలో నాయకులు పోరిక గోవింద్ నాయక్, శ్రీనివాస్, భిక్షపతి, కుమారస్వామి తదితరలు ఉన్నారు.

అర్హులైన లబ్ధిదారులను ఐటీడీఏకు పంపించాలి

వాజేడు : ఇందిరా సౌర జలగిరి వికాస పథకానికి ఎంపికైన లబ్ధిదారుల్లో అర్హులను ఐటీడీఏకు పంపించాలని వాజేడు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీకాంత్ నాయుడు అన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలోని సమావేశ మందిరంలో గురువారం అటవీశాఖ, రెవెన్యూ, విద్యుత్, గ్రామ పంచాయతీ, ఇరిగేషన్, పెసా కోఆర్డినేటర్లు, మొబలైజర్లతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాజేడు మండలం నుంచి ఇందిరా సౌర జలగిరి వికాస పథకానికి 103 మంది లబ్ధిదారులు ఎంపికైనట్లు తెలిపారు. ఈ నెల 18 నుంచి 20 వరకు సర్వే నిర్వహించి వారిలో అర్హులను గుర్తించి ఐటీడీఏకు పంపించాలని సూచించారు. అందుకు సర్వే బృందాలను ఎంపిక చేసి పక్కాగా సర్వే చేయాలని తెలిపారు.

బీజేపీ ఆధ్వర్యంలో తిరంగా ర్యాలీ



వెంకటాపురం(ఎం): మండలంలోని లక్ష్మీదేవిపేటలో బీజేపీ ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా అభియాన్ కార్యక్రమంలో భాగంగా జాతీయ జెండాలతో ర్యాలీ నిర్వహించినట్లు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు భూక్య జవహర్‌లాల్ తెలిపారు. గ్రామంలో పాఠశాల విద్యార్థులతో కలిసి దేశభక్తి నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో హర్ ఘర్ తిరంగా జిల్లా కన్వీనర్ నగరపు రమేష్, బీజేపీ నాయకులు శీలమంతుల రవీంద్రాచారి, యాదగిరి, సురేందర్, విశ్వనాథ్, రెడ్డి శ్రీనివాస్, దేవేందర్ పాల్గొన్నారు.

ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు



శ్రీకృష్ణుడి వేషధారణ, గోపిక వేషధారణలతో వేదవ్యాస స్కూల్ పిల్లలు

వెంకటాపురం(ఎం) : మండలంలోని వేదవ్యాస ఉన్నత పాఠశాలలో విద్యార్థులచే ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించినట్లు ప్రధానోపాధ్యాయుడు పోశాల వీరమల్లు తెలిపారు. శుక్రవారం స్వాతంత్ర్య దినోత్సవం, శనివారం కృష్ణాష్టమి రోజున పాఠశాలలకు సెలవు ఉండడంతో ముందస్తుగా పాఠశాలలో వేడుకలు నిర్వహించినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా పిల్లలు శ్రీకృష్ణుడి వేషధారణ, గోపిక వేషధారణలతో అలరించారని పేర్కొన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు



భూమి పూజ చేస్తున్న రవిచందర్

ములుగు రూరల్: అర్హులందరికీ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తుందని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్ అన్నారు. మండల పరిధిలోని బండారుపల్లిలో గురువారం ఇందిరమ్మ ఇళ్ల భూమి పూజ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం నిరుపేదల కోసం ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తుందని అన్నారు. ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు నిర్మాణాలు త్వరగా పూర్తి చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ములుగు మున్సిపల్ కమిషనర్ సంపత్, కాంగ్రెస్ పార్టీ నాయకుడు భిక్షపతి, సమ్మయ్య, నాగరాజు, రాజన్న, అశోక్ గైడ్, మహేందర్, ఉన్నారు.